సర్వం.. ప్లాస్టిక్‌మయం

- కానరాని నిషేధం
- నామమాత్రంగా దాడులు
- పట్టించుకోని జోన్–3 అధికారులు



ప్లాస్టిక్ కవర్‌లో కూరగాయల తరలింపు

సీతమ్మధార: అందుబాటులో ఉంటుందన్న నెపంతో భవిష్యత్‌లో జరగబోయే అనర్థాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. 40 మైక్రాన్ల లోపు పాలిథిన్ కవర్ల వినియోగం షరా మామూలైపోయింది. జీవీఎంసీ అధికారులకు గుర్తొచ్చినప్పుడు అడపాదడపా తనిఖీలు.. నాలుగైదు రోజులు రైతుబజార్లలో





ప్లాస్టిక్ కవర్‌లో ఉల్లిపాయల తరలింపు

హడావిడి తర్వాత మళ్లీ యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు సాధారణం అయిపోయింది. అంతే తప్ప పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం వట్టిమాటే అంటే అతిశయోక్తి కాదు. నగరంలో పాలిథిన్ కవర్ల నిషేధం ఆటకెక్కింది అంటే అతిశయోక్తి కాదు. వ్యాపారులు విక్రయిస్తున్న కవర్లన్నీ 40 మైక్రాన్ల మందం లేవన్నది జగమెరిగిన సత్యమే. నిషేధం గుర్తొచ్చినప్పుడు అధికారులు చిరు వ్యాపారుల మీద తమ ప్రతాపం చూపి, జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తున్నారు తప్ప నిబంధనలు కచ్చితంగా అమలు చేయడానికి ముందుకు రావడం లేదు. అధికారులు హెచ్చరించినప్పుడు, దాడులు చేస్తారన్న కొద్దిపాటి భయంతో వారం, పది రోజులు కవర్లలో సరుకులు ఇవ్వడం మానేస్తున్నారు. వారు వస్తున్నారని తెలియగానే కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నగరంలో కాలుష్యం తగ్గాలంటే ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించక తప్పదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. పలుచోట్ల చెత్తకు నిప్పు పెట్టినపుడు అందులోని ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా కాలిపోయి పర్యావరణానికి తీరని హాని కలుగుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

అనర్థాలు అన్నీ ఇన్నీ కావు...

గుట్టల్లా పేరుకుపోతున్న వ్యర్థాలు..

వాడి పడేసిన పాలిథిన్ కవర్లు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. మట్టి, నీళ్లు, కొండలు, గుట్టలు, చివరికి కాలువలు, గెడ్డల్లో పాలిథిన్ వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. చెత్త కుండీల్లో, ఆట మైదానాల్లో, బీచ్, మురుగు కాలువల్లో, ఖాళీ స్థలాల్లో.. ఇలా ఎక్కడ చూసినా పాలిథిన్ కవర్లే కనిపిస్తున్నాయి. కనీసం ఇవి రీసైక్లింగ్‌కు కూడా ఉపయోగపడవు. అతి పలుచగా ఉన్న పాలిథిన్ కవర్లను గుర్తించని పశువులు తింటూ చనిపోతున్నాయి.



ప్లాస్టిక్ కవర్‌లో కూరగాయలు తీసుకెళ్తున్న వినియోగదారుడు

పాలిథిన్ కవర్లు మట్టిలో కలవడానికి వెయ్యి సంవత్సరాలు పడుతుందని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చెబుతున్నారు. మట్టికి మనిషికి మధ్య అడ్డుగోడలా పాలిథిన్ నిలుస్తోంది. నగరంలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తరలించే ఓపిక లేక పారిశుధ్య సిబ్బంది కాల్చి పారేస్తున్నారు. ఆ మంటల్లోంచి విష వాయివులు పుట్టుకు వస్తున్నాయి. ఫలితంగా క్యాన్సర్, మూత్రపిండాల సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు, చర్మ సమస్యలు వస్తున్నాయి.

ప్రజల్లో మార్పుతోనే సాధ్యం..

పర్యావరణ ఉపయుక్తమైన సంచులు తప్ప పాలిథిన్ సంచులు వాడకూడదన్న ఆలోచన ప్రజల మనస్సుల్లోంచి వస్తే తప్ప ఈ సమస్యను అధిగమించలేం. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చినప్పుడే పర్యావరణం పరిరక్షించబడుతుంది. అందరూ కలిసి రాకపోతే పాలిథిన్ రక్కసి మనల్ని మింగేయడం ఖాయం. కాగా తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న హోల్‌సేల్ వ్యాపారులపై చర్యలు తీసుకుంటే వినియోగం సమస్య వుండదు కదా అని పలువురు సూచిస్తున్నారు.



యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం

కఠిన చర్యలు తీసుకుంటున్నాం



ప్లాస్టిక్ వినియోగం పట్ల కఠిన చర్యలు తీసుకుంటున్నాం. జోన్–3 పరిధిలో గల తూర్పు, ఉత్తర (పార్టు) నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు 150 కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నాం. ఈ ఏడాది జనవరి 1 నుంచి నిషేధం అమల్లోకి వచ్చింది. కిరాణా దుకాణాలు, షాపింగ్ మాల్స్, రైతుబజార్లలో నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. తక్కువ మైక్రాన్స్ ఉన్న పాలిథిన్ కవర్లు వాడుతూ పట్టుబడితే జరిమానా విధిస్తున్నాం. నిషేధంపై ఎప్పటికప్పుడు జోన్–3 పరిధిలో సిబ్బంది ద్వారా ప్రచారం చేస్తున్నాం.

– బి.ప్రసాదరావు, సహాయ వైద్యాధికారి, జీవీఎంసీ జోన్–3

క్లుప్తంగా

మానవత్వమే నిజమైన మతం



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: మతం మనుషులను కలపాలి గాని.. విడగొట్టకూడదని, మానవత్వం కలిగి ఉండటమే నిజమైన మతమని గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం యునైటెడ్ రిలీజియన్స్, గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఈస్టర్ సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి అన్ని మతాలు కృషి చేయాలన్నారు. విశ్రాంత వీసీ ఏపీఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ ఏసు ప్రభువు తిరిగి జన్మిస్తారన్న విశ్వాసంతో ఈస్టర్ జరుపుకుంటారని తెలిపారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం కశ్మీర్ ఘటనలో మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశాలాక్షి, ప్రజ్ఞాన్‌కుమార్, జైన్ అనురాధ, నరసింహారావు, విశ్వనాథం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎన్‌ఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయినికి పురస్కారం



బండి హేనా

సీతమ్మధార: స్థానిక పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయిని బండి హేనాకు అంతర్జాతీయ ఉత్తమ సామాజిక కార్యకర్తగా పురస్కారం ప్రకటించారు. ఢిల్లీకి చెందిన ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్ వైడ్ ఫౌండేషన్ ద్వారా ఆమెకు ఈ పురస్కారం రావడంపై పాఠశాల వర్గాలు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశాయి. ఈ నెల 30న ఉదయం 10 గంటలకు ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో హేనాకు ఈ పురస్కారం అందజేస్తారని సంస్థ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆమె ఈ పాఠశాలలో 15 ఏళ్లుగా ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు గుర్తింపుగా పురస్కారానికి ఎంపిక చేశారు. ఎన్‌ఎంసీ హైస్కూల్‌లో 8, 9 తరగతులు చదువుతున్న కొందరు విద్యార్థులకు ఫీజు విషయంలో హేనా ఆర్థిక సాయం చేయడం విశేషం.

పాలిసెట్ నిర్వహణకు సంపూర్ణ సహకారం

మురళీనగర్: పాలిసెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సహకరించాలని పాలిసెట్ విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. విశాఖపట్నం కో ఆర్డినేటింగ్ కేంద్రం పరిధిలోని పరీక్ష కేంద్రాల నిర్వహణ అధికారులతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ పరిధిలోని 22 కేంద్రాల్లో 9,382 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని చెప్పారు. కార్యక్రమంలో 22 కేంద్రాలకు సంబంధించిన చీఫ్ సూపరింటిండెట్లు, పరిశీలకులు, రూట్ ఆఫీసర్లు, పాల్గొన్నారు. వీరు నిర్వహించాల్సిన విధులను ఆయన తెలిపారు. అసిస్టెంట్ కో ఆర్డినేటర్ కె.డి.వి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కలాసీ దుర్మరణం

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా.. కంచరపాలెంలో నివసిస్తున్న కొండబాబు(42) కలాసీగా పనిచేస్తున్నాడు. ఇతడు సీతంపేటలో శనివారం మధ్యాహ్నం రోడ్డు మీద నడుస్తుండగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సింహాచలం వెళ్తున్న 28జెడ్/హెచ్ ఏపీ31 జెడ్0184 సిటీ బస్ కింద ప్రమాదవశాత్తూ పడి తీవ్రగాయాల పాలయ్యాడు. పోలీసులు కేజీహెచ్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ కొండబాబు మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌లో ఉంచారు. ద్వారకా సీఐ డి.వి.రమణ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి బంధువులు ద్వారకా పోలీస్ స్టేషన్‌లో స్వయంగా లేదా 63051 87009 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వర్మా కాంప్లెక్సు వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో బాటసారులకు చల్లని మజ్జిగ అందించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి తదితరులు పాల్గొన్నారు.

కె.కె.రాజుకు నాయకుల అభినందన



పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజును అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాజుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర మాజీ నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె. రాజుకు సీతమ్మధారలోని ఎంఎంటీసీలో గల అతని కార్యాలయంలో 54 వార్డుకు చెందిన పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడితి చిరంజీవి, ఎర్రబెల్లి ప్రసాద్, అచ్యుతరావు, రమణమ్మ, రమేష్, పారన్న, శ్రీనివాస రెడ్డి, శ్రీను, రాంబాబు, శంకర్, సుగుణ, చిన్ని, దంతూ, సన్యాసిరావు, వార్డు కార్యకర్తలు, 24వ వార్డుకు చెందిన కర్రి మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పహల్గామ్ దాడికి మూల్యం చెల్లించక తప్పదు

మంత్రి సత్యకుమార్ యాదవ్

మురళీనగర్: పహల్గామ్‌లో ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇస్తున్న దేశాలు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హెచ్చరించారు. మురళీనగర్‌లోని బొత్స స్క్వేర్‌లో శనివారం నిర్వహించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో కాశ్మీర్‌లో శాంతి నెలకొనడాన్ని జీర్ణించుకోలేని శక్తులు దాడులకు తెగబడుతున్నాయని అన్నారు. ఈ దాడి దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకే అని, భారతీయులంతా ఒక్కటేనని నిరూపించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. అనంతరం విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ కాశీ విశ్వనాథం, బులుసు జగదీష్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మూలా వెంకటరావు మంత్రి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాథరాజు, రాష్ట్ర కోశాధికారి ఎం. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మూలా వెంకటరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ఉగ్రదాడి అమానుషం



నిరసన తెలుపుతున్న ప్లైవుడ్, గ్లాస్ అండ్ లామినేట్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సీతంపేట: పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా విశాఖపట్నం ప్లైవుడ్, గ్లాస్ అండ్ లామినేట్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం దుకాణాలు బంద్ చేసి భారీ ర్యాలీ నిర్వహించారు. శంకరమఠం రోడ్డు శాంతిపురం హైవే జంక్షన్ నుంచి డైమండ్ పార్క్ వరకు వందలాది మంది ప్రదర్శనగా ర్యాలీ నిర్వహించారు. పాక్ దుందుడుకు చర్యలను అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా దేశ ప్రజల మద్దతు ఉంటుందని అసోసియేషన్ ప్రతినిధి వినీత్ కుమార్ జైన్ అన్నారు. టెర్రరిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రాజు, రాజేష్ పాటిల్, భూపెన్, శ్రవణ్, విష్ణు, చిరంజీవి, మిల్లెన్, దీపక్ తదితరులు పాల్గొన్నారు



అమరులకు నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ శ్రేణులు

ప్రతి ఒక్కరూ ఉగ్రదాడిని ఖండించాలి..

సీతమ్మధార: భారతీయులపై జరిగిన ఉగ్రవాద దాడిని ఖండించాలని కోరుతూ సీతమ్మధార జంక్షన్ అల్లూరి విగ్రహం వద్ద శనివారం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మృతులకు నివాళులు అర్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్. మధురెడ్డి మాట్లాడుతూ భారతీయులపై ఉగ్రవాదుల దాడి బాధాకరమని, ఈ దాడిలో 27 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి ఉగ్రవాదులు భారత భూభాగంలో చొరబడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల గోవింద్, రావి కృష్ణ, రావి అశోక్, తేజ శ్రీను, భాను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ముగిసిన చందనం అరగదీత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత శనివారంతో పూర్తయింది. ఈనెల 30న చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి సమర్పించాల్సిన మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఈనెల 24వ తేదీ నుంచి అరగదీతను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా మూడు రోజుల్లోనే అరగదీతను సిబ్బంది పూర్తిచేశారు. కావాల్సిన సుమారు 125 కిలోల పచ్చి చందనాన్ని సిద్ధం చేశారు.

29 నుంచి మిల్లెట్స్ ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం

సీతమ్మధార: అలీప్ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఆహార ఉత్పత్తులపై అవగాహన కల్పించనున్నట్లు సంస్థ అధ్యక్షురాలు ఒ.రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాలు (మిల్లెట్స్) ఉత్పత్తులపై ఈనెల 29, 30 తేదీల్లో ఉదయం 10.30 నుండి సీతమ్మధార ఎంఎంటీసీ కాలనీలో గల తమ కార్యాలయంలో శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

రైల్వేస్టేషన్‌లో భద్రతాదళాలు అప్రమత్తం



రైల్వేస్టేషన్ బయట ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో భద్రతా దళాలను కట్టుదిట్టం చేశారు. భద్రతను పెంపొందించి, ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి సందర్భంగా కేంద్రం దేశవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా విశాఖపట్నం రైల్వేస్టేషన్, వాల్తేర్ డివిజన్ పరిధిలో గల విజయనగరం, శ్రీకాకుళం రోడ్, రాయగడ, జగదల్‌పూర్, లక్ష్మీపూర్ రోడ్, కోరాపుట్ వంటి పలు ముఖ్య స్టేషన్లలో భద్రతను పెంచారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రతి ప్రయాణికుడి టికెట్ తనిఖీ చేసి, సరైన టికెట్ ఉంటేనే స్టేషన్‌లోకి అనుమతిస్తున్నారు.

రైల్వే ప్రయాణికులకు సదుపాయాలు



తాగునీరు అందిస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

తాటిచెట్లపాలెం: మండే ఎండల్లో ప్రయాణికులకు కొంతైనా ఉపశమనం కలిగించేందుకు వాల్తేర్ డివిజన్ పలు ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో గల విశాఖపట్నం రైల్వే స్టేషన్‌తో సహా విజయనగరం, శ్రీకాకుళం రోడ్, రాయగడ, దువ్వాడ వంటి పలు ప్రధాన స్టేషన్లలో ప్రయాణకులకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పలు ప్లాట్‌ఫాంలలో స్వచ్ఛంద సంస్థలు, వాల్తేర్ డివిజన్ సివిల్ డిఫెన్స్ సభ్యులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రయాణికులకు సేవలందిస్తున్నారు. వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా సూచనలతో ప్రయాణికుల భద్రత, సౌఖ్యం, వసతి, సదుపాయాలను మెరుగుపరిచే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించాలి



మోడల్ గ్రాండ్ టెస్ట్‌ను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

మురళీనగర్: పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించాలని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు విద్యార్థులకు సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న పాలిసెట్–2025 ఉచిత శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలతోపాటు ప్రభుత్వం అందించిన మెటీరియల్‌ను ఉపయోగించుకుని సాధన చేయాలన్నారు. ఈ నెల 30న నిర్వహించే పాలిసెట్‌లో ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులు సత్తా చాటాలన్నారు. పరీక్ష 120 మార్కులకు ఉంటుందని, వీటిలో గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ప్రశ్నలు ఇస్తారన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ పి.ఎం.బాషా పర్యవేక్షణలో ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. శిక్షణకు 222 మంది హాజరు కాగా.. వీరిలో 157 మంది గ్రాండ్ టెస్ట్ రాశారు. పరీక్ష ఫలితాలు త్వరలో విద్యార్థులకు తెలియజేస్తామని ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు.

30న త్రిముఖ విఘ్నేశ్వరాలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయ 11వ వార్షికోత్సవం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఆలయంలో శనివారం కమిటీ సభ్యుల సమక్షంలో ఆయన ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్షికోత్సవంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తామని తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలంతా పాల్గొనాలని కోరారు. శక్తి పంచాయతన పీఠాధిపతి కాకరపర్తి సత్యనారాయణమూర్తి దంపతులు ముఖ్య అతిథులుగా విచ్చేసి 108 కళశాలతో అభిషేకం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు చొప్పల్లి భాస్కరరావు, సహాయ అర్చకుడు వి.ఎస్.కుమార్, కమిటీ ఉపాధ్యక్షుడు జి.కృష్ణ, సహాయ కార్యదర్శి టి.వెంకటరావు, కార్యదర్శి ఎం.ఎస్.ప్రకాశరావు, పి.వి.రమణ, కె.ఎస్.ఎన్.మూర్తి, టి.వి.రమణమూర్తి, సరోజిని, మహాలక్ష్మి, శివగంగ, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమాండర్ అజతుల్లా ఖాన్

కంచరపాలెం: నేవల్ డాక్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కార్మికులు, ఉద్యోగులు 134 యూనిట్ల రక్తం అందించి ఆదర్శంగా నిలిచారు. కంచరపాలెం దరి మేగాద్రిపేట రెసిడెన్షియల్ కాలనీలోని ఓ ఆడిటోరియంలో శనివారం డాక్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కార్మిక ఉద్యోగుల అప్‌లిఫ్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి డాక్‌యార్డ్ జనరల్ మేనేజర్ హెచ్ఆర్ కమాండర్ అజతుల్లా ఖాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సరైన సమయానికి రక్తం అందక అనేకమంది మృత్యువాత పడుతున్నారన్నారు. అటువంటి సందర్భం రాకుండా ఉండాలని సామాజిక స్పృహతో రక్తదాన శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అప్ లిఫ్ట్ అసోసియేషన్ అధ్యక్ష–కార్యదర్శులు మానప్రకాష్‌రావు, కోటి రాంబాబు, ఐఎన్‌టీయూసీ ఈ యూనియన్ మాజీ అధ్యక్షుడు బి.భోగేశ్వరరావు రక్తదానం చేసిన ఉద్యోగ, కార్మికులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫస్ట్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది, యూనియన్ నేతలు జి.అరుణ్‌కుమార్, రాజేష్, ఎడ్ల రాజేష్, ఎస్వీ రమణ, జి.ఎ.స్వామి, కోడి మురళీకృష్ణ, అప్పలరాజు, బత్తుల విజయకుమార్, గంట అంబేడ్కర్, జి.సుదర్శన్ రావు, రాజా, సుదీశ్వరరావు, సన్నీ, బి.జగదీష్, రాజశేఖర్, బి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు చేయిస్తాం..



వివరాలు నమోదు చేస్తున్న కార్పొరేటర్ పద్మారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి శనివారం రాత్రి వార్డులోని పలు కాలనీల్లో పర్యటించారు. నక్కవానిపాలెం, గాంధీ నగర్, క్రాంతినగర్, సత్యం జంక్షన్, రామాలయం, 60 ఫీట్ రోడ్డు, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో స్థానికుల సమస్యలను అడిగి ఆమె తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో వెలగని వీధిలైట్ల స్తంభాల నంబర్లను కార్పొరేటర్ స్వయంగా నమోదు చేసుకోవడం విశేషం. వెంటనే ఆమె జోన్–3 ఎలక్ట్రికల్ విభాగం ఇంజినీర్లకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. రెండు రోజుల్లో వీధిలైట్లకు మరమ్మతులు చేయిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. వార్డులోని అన్ని వీధిలైట్లు వెలిగి తీరాలని ఆమె స్పష్టం చేశారు. రాత్రిపూట పలు ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగక ఇబ్బందిగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నక్కవానిపాలెం దరి ఇందిరాగాంధీ విగ్రహం వీధిలోని 51–6–4 డోర్ నంబర్ గల ఇంటి వద్ద శిథిలావస్థకు చేరుకున్న స్తంభాలను ఈపీడీసీఎల్ ఇంజినీర్ల ద్వారా మారుస్తామన్నారు. కార్పొరేటర్ వెంట వార్డు నాయకురాలు సీతాకుమారి ఉన్నారు.

దివ్యాంగులకు పక్కాగా సంక్షేమ పథకాల అమలు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్, దివ్యాంగుల పథకాల అమలు ప్రతి శాఖలో నోడల్ అధికారి పర్యవేక్షణలో జరగాలని సూచించారు. దివ్యాంగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని, వారి హక్కులు, చట్టాలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. దివ్యాంగుల పిల్లలకు విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, వారు అన్ని ప్రదేశాలను సందర్శించేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మాధవితో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డివిజనల్, మండల స్థాయిలో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ మీటింగ్‌లో కలెక్టర్ మాట్లాడారు.